క్లుప్తంగా

సుదర్శనుడికి పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన భగవానుడికి మంగళవారం జన్మ తిరు నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. నవ కలశాలతో పంచామృతాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శాస్త్రోక్తంగా సుదర్శన భగవానుడి పంచలోహ విగ్రహాలకు అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల సేవా కార్యక్రమాలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

ఏలేశ్వరం: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో మంగళవారం పోలీసులు పలుసేవా కార్యక్రమాలు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక స్వామి దయానంద సేవాశ్రమంలో అనాథ పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శైలజ, పోలీస్ సిబ్బంది మాణిక్యలరావు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ఫ్యాన్ల వితరణ



ప్రిన్సిపాల్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంగళవారం విద్యార్థులు రెండు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. కళాశాలలో రెండో సంవత్సరం బీకాం చదువుతున్న విద్యార్థులు ఫ్యాన్లను ప్రిన్సిపాల్ డి.సునీతకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కళాశాలకు ఫ్యాన్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామాయిల్ మొక్కల పంపిణీ



రమణయ్యపేటలో రైతులకు మొక్కలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏలేశ్వరం: రమణయ్యపేటలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఏపీ ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు పామాయిల్ మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ చేతుల మీదుగా మొక్కలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ముగలపాటి రమేష్, గుమ్ములూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతా మేళా

రౌతులపూడి: ఎ.మల్లవరంలో కాకినాడ జిల్లా పోస్టల్ మేనేజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం మెగా పోస్టల్ ఖాతా మేళా నిర్వహించారు. సర్పంచ్ చిందాడ పెదరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు కాకి నాని ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు నగదు బదిలీ, ఉపాధి హామీ తదితర పథకాలను లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలకు జమ చేసేందుకు ఈ ఖాతాలు దోహదపడతాయని పోస్టల్ జిల్లా మేనేజర్ శ్రీదేవి అన్నారు. గ్రామంలో సుమారు 300 మంది లబ్ధిదారులు కొత్తగా పోస్టల్ ఖాతాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐపీఓ చైతన్య, బీపీఎం వినోద్, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు నాకిరెడ్డి అప్పలనాయుడు, నాకిరెడ్డి పెద్దాపురం, బీమిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

మినీ ఫిష్ ఆంధ్ర షాపు ప్రారంభం

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో మినీ ఫిష్ ఆంధ్ర షాపును మంగళవారం ప్రారంభించారు. మత్స్యశాఖ ద్వారా బ్రతికి ఉన్న చేపలు, ఎండు చేపలు, సముద్రం చేపలను భద్రపరుచుకోవడానికి రూ.1.75 లక్షలు విలువైన సామగ్రిని సబ్సిడీపై అందించగా వీటి అమ్మకాలను గ్రామ పెద్దలు ఆకుల సత్యనారాయణ, కోలా మల్లిఖార్జునరావు, కొత్తపల్లి సత్యన్నారాయణ, నల్లల నాగేశ్వరరావు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ గణేశ్వరరావు ప్రారంభించారు.

షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించండి

శంఖవరం: నాన్ షెడ్యూల్ ప్రాంతాలుగా ఉన్న గిరిజన గ్రామాలకు షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించాలని అఖిల భారత ఆదివాసీల సంఘం రాష్ట్ర కన్వీనర్ పీఎస్ అజేయ్‌కుమార్ అన్నారు. గిరిజన గ్రామమైన పి.మల్లాపురంలో ఆదివాసీలతో సమావేశమై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఆదివాసీలకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. కాకూరి రాజుబాబు,బూసరి బాలరాజు, ముర్ల దొంగబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో క్రాంతి

- వైఎస్సార్ క్రాంతి పథకంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం
- గ్రామాల్లో ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు
- గ్రూపులకు రుణ సదుపాయం



లచ్చిరెడ్డిపాలెంలో రైతు ఉత్పత్తి సంఘంలో మహిళ పెంచుకుంటున్న గొర్రెలు

రౌతులపూడి: ప్రభుత్వం గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. గ్రామాల్లో మహిళా రైతులను సంఘటితం చేసి ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహిస్తోంది. డీఆర్‌డీఏలోని సెర్ప్ ఆధ్వర్యంలో వైఎస్సార్ క్రాంతి పథకంలో భాగంగా గ్రామీణ రైతులను సమ్మిళితం చేస్తోంది. ఈ పథకం ద్వారా గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి నిధులు అందించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. గ్రామీణ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేస్తోంది.

రైతుల సంఘాల ఏర్పాటు ఇలా...

డ్వాక్రా మహిళలు సంఘాలుగా ఏర్పడిన పొదుపు కట్టి, రుణాలు పొందే విధంగా మామిడి, జీడిమామిడి రైతులను, గొర్రెలు, మేకల పెంపకందారులను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేశారు. వారు పొదుపు కట్టుకునేలా, వారి ఆర్థికాభివృద్ధికి అవసరమైన సలహాలు, శిక్షణలు అధికారులు ఇస్తున్నారు. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 మంది రైతులు ఉన్నారు. ఇలా ఏర్పడిన సంఘాలు మామిడి, జీడిమామిడి రైతు ఉత్పత్తిదారులు సంఘాలు 167, గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘాలు 85 ఉన్నాయి. తొలిసారిగా మండలంలో 105 సంఘాలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రారంభించారు. గ్రామాల్లోని ఆసక్తి ఉన్న రైతులను కొత్త సంఘాలుగా ఏర్పాటు చేయటం, ప్రస్తుతం ఉన్న సంఘాల సభ్యులకు ఎప్పటికప్పుడు సమావేశాలు, శిక్షణలు ఇస్తూ వ్యవసాయాభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

సంఘాలతో లాభాలు

మండల వ్యాప్తంగా ఏర్పడ్డ సంఘాల అభివృద్ధికి సంబంధించి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు మొదటిలో రూ.35 లక్షలు కేటాయించారు. ఈ సొమ్ములను సంఘాల అభివృద్ధికి వ్యవసాయ పనిముట్లు కొనుగోలు, విత్తనాలు, ఎరువులు, బ్రష్ కట్టర్లు, స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పరికరాలు కొనుగోలుకు రుణాలుగా అందించేవారు. క్రమం తప్పకుండా సంబంధిత బ్యాంకులలో పొదుపు సక్రమంగా చెల్లించిన సంఘాలకు సుమారు రూ.50 వేల నుంచి రుణాలు తీసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు 55 మామిడి, జీడిమామిడి రైతు ఉత్పత్తి సంఘాలకు, 45 గొర్రెలు, మేకలు పెంపకందార్లకు వైఎస్సార్ క్రాంతి పథకంలో ఈ సంఘాల్లోని రైతులకు రుణ సదుపాయ కల్పించినట్టు అధికారులు వెల్లడించారు. సంస్థ ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకునేందుకు, తిరిగి వాటిని చెల్లించేందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండలంలోని ఎ.మల్లవరం, గిడజాం, బలరామపురం, ములగపూడి, గంగవరం, దిగువ శివాడ, రాజవరం, గుమ్మరేగుల, రౌతులపూడి, ఎస్.అగ్రహారం, బంగారయ్యపేట, శృంగవరం, పారుపాక, ఎన్.ఎస్ పట్నం గ్రామాల్లో ఈ రైతు ఉత్పత్తి సంఘాలు ఉన్నాయి.

జీవనోపాధి



ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీజీ రైతు ఉత్పత్తి సంఘంలో చేరాను. పొదుపును సక్రమంగా కడుతున్నాను. బ్యాంకులో రూ.50 రుణం తీసుకొని మేకలు కొనగోలు చేసుకుని పెంచుకుంటున్నా. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నాను. ఇదే నా జీవనోపాధి. గ్రామంలో కూలి పని చేసుకుంటున్న నాకు రుణమిచ్చి ఆదాయం వచ్చే మార్గం చూపించారు.

–పోతుబంది రమణమ్మ రాఘవపట్నం

సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



వైఎస్సార్ క్రాంతి పథకం ఆధ్వర్యంలో నెలకొల్పిన రైతు ఉత్పత్తి సంఘాల మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. గ్రామాల్లో మహిళా రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఈ సంఘాల ద్వారా వ్యవసాయ, జీవనోపాధి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేస్తున్నాం. వీటి ద్వారా సుమారు కోటి రూపాయల వరకూ వెచ్చించి మహిళా రైతులను పోత్సహిస్తున్నాం. రానున్న రోజుల్లో వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాం.

–సూర్యకుమారి ఇన్‌చార్జ్ ఏపీఎం రౌతులపూడి

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి మంత్రి అభినందన



బ్యాడ్మింటన్ క్రీడాకారుడు జగన్నాథ్‌ను అభినందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ఆల్‌ఇండియా మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో కాంస్య పథకం సాధించిన పడాల శ్రీ వెంకట జగన్నాథ్‌ను మంత్రి దాడిశెట్టి రాజా అభినందించారు. స్థానిక శ్రీరాజా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ క్రీడాకారుడు జగన్నాథ్ గత మార్చిలో గోవాలో జరిగిన 2023 ఆల్‌ఇండియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో ఏపీ తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచి 45 ప్లస్ మెన్ డబుల్స్ విభాగంలో కాంస్య పథకం సాధించాడు. అలాగే వచ్చే సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ సౌత్ కొరియాలో జరిగే 2023 వరల్డ్ సీనియర్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. మంగళవారం జగన్నాథ్ ఎస్.అన్నవరం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రాజా అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చి విజయం సాధించాలని ఆకాంక్షించి రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. తుని ప్రాంతానికి చెందిన మరింత మందిని బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కోరారు. మంత్రి ధాతృత్వానికి శ్రీరాజా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు



తామరాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రేఖవానిపాలెంలో 'జగనన్న సురక్ష' ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



శృంగవృక్షంలో లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తామరాడలో జగనన్న సురక్ష కార్యక్రమం

కిర్లంపూడి: జగనన్న సురక్షతో గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తామరాడలో మంగళవారం సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తోట విష్ణు, చదలవాడ బాబీ, భూపాలపట్నం ప్రసాద్, అల్లు శివరామకృష్ణ, బొజ్జప్ప శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్ మడక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తుని రూరల్: జగనన్న సురక్ష పథకంతో ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలకు రక్షని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మంగళవారం తుని మండలం రేఖవానిపాలెం, చేపూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీపీ రాము మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జి నాగేంద్ర నెహ్రూ, తహసీల్దార్ శివకుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులైన పేదలందరికీ మేలు

రౌతులపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలందరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం బలరామపురం సచివాలయం వద్ద ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివానం, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయల సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబై డైరెక్టర్ పులి మదు,సర్పంచ్ దాసరి తాతాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు సోమరౌతు భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ స్థానిక నేతలు అచ్చిర్డి సాంబ తదితరులు డీటీ పీవీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సురక్షతో సత్వర పరిష్కారం

తొండంగి: శృంగవృక్షం గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్, సర్పంచ్ దార అప్పన్న, ఎంపీటీసీ అడపా సూర్యచక్రం, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- పెద్దనాపల్లిలో గడపగడపకూ



పెద్దనాపల్లి గ్రామస్తులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. లబ్ధిదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ఏర్పాటుతో ప్రతి అర్హుడికి సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, సర్పంచ్ బుద్ధా సూర్య ప్రకాశ్, బుద్ధా ఈశ్వరరావు, శిలపరశెట్టి వెంకన్నబాబు, బుద్ధా నాగభూషణం, సామంతుల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కాండ్రేగులలో గడప గడపకూ..

జగ్గంపేట: కాండ్రేగులలో మంగళవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జేసీఎస్ మండల కన్వీనర్, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, గ్రామ సర్పంచ్ బొదిరెడ్డి చక్రరావు తదితరులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బలరామపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

రౌతులపూడి: మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం బలరామపురంలో రూ.పది లక్షలు ఉపాధి హామీ నిధులు, మరో రూ.8 లక్షలు డీఎంఎఫ్ నిధులను వెచ్చించి నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

వసతి గృహం నిర్మాణానికి శంకుస్థాపన

శంఖవరం: డీఎంఎఫ్ నిధులు రూ.59 లక్షలతో కత్తిపూడిలో చేపడుతున్న సోషల్ వేల్ఫేర్ బాలుర వసతి గృహ నిర్మాణానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, జీలకర్ర వీష్ణు, బొప్పా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మాదేపల్లి మహేష్ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



కోటనందూరులో వలంటీరుకు నియామక పత్రం అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. కాకరాపల్లికి చెందిన మానెల్లి రమేష్, శివలంక వసంతలక్ష్మి, టీజే నగరానికి చెందిన అల్లు నానాజీలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లూరి శ్రీను, సుర్ల శ్రీను, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మనీటి సాగుతో మంచి ఫలితాలు

- జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాదరావు
- ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

కోటనందూరు: సూక్ష్మనీటి సాగు విధానంలో తక్కువ నీటితో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీవీ వరప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి బిందు, తుంపర సేద్యం పథకంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు సదుపాయం ఉన్న రైతులను మైక్రో ఇరిగేషన్ వైపు అడుగులేసేలా ప్రోత్సహించాలన్నారు. సూక్ష్మనీటి సాగు విధానాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలను అందిస్తుందన్నారు. బోరు ఉండి బిందు(డ్రిప్)సేద్యం చేసే 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుంటుండగా రైతు వాటాగా 10 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. 5 ఎకరాల పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వస్తుందన్నారు. తుంపర్ల(స్ప్రింక్లర్లు) సేద్యం చేసే రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ పైపులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పేర్లు నమోదులో ఆధార్, బ్యాంకు ఖాతా, 1బీ ఫారం, ఎఫ్ఎంబీ ఫారం, ఫోన్ నంబర్ అవసరమవుతాయన్నారు. ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ జీవీ లక్ష్మి, వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుని: రోడ్డు ప్రమాదంలో వ్యకి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ఆర్.మురళీ మోహన్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కోసూరి శ్యాం కుమార్, అతని స్నేహితుడు గొర్రెల కిరణ్‌బాబు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి తుని వస్తున్నారు. తుని హైవేలో ఉడిపి హోటల్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి ఓ లారీ వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనం వెనుక కూర్చున్న శ్యాంకుమార్ కిందపడిపోవడంతో లారీ అతని కాళ్లపై నుంచి పోవడంతో బలమైన గాయాలయ్యాయి. అతనిని హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వివరించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా శ్యాంకుమార్

తుని: ఎమ్మార్పీఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ముప్పిడి శ్యాంకుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక కొండవారిపేటలో జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్యాంకుమార్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర,కోస్తా జిల్లాల ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చినసుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి కాకాడ సూకరాజు, కాకినాడ జిల్లా ఎమ్మెస్పీ ఇన్‌చార్జ్ చెట్టే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు

తుని రూరల్: కేఓ మల్లవరంలో మురుగు కాలువల్లో పూడికను తొలగించారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుడు డొంక వెంకట బెనర్జీ, కార్యదర్శి పైల శివ పర్యవేక్షణలో ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికలను జేసీబీతో తొలగించారు. సర్పంచ్ డొండ సత్యవతి ఆధ్వర్యంలో తొలగించిన పూడికలు, వ్యర్థాలను ట్రాక్టర్‌పై దూరప్రాంతానికి తరలిస్తున్నట్టు కార్యదర్శి తెలిపారు. దీంతో వర్షపునీరు దిగువకు సులభంగా ప్రవహిస్తుందన్నారు. వర్షాలు కురుస్తుండడం వల్ల శానిటేషన్ పనులు చేపట్టామన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయవద్దని, పంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసిన కుండీల్లోనే చెత్త వేయాలన్నారు.

జగ్గంపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని డ్రైనేజీ పూడుకుపోవడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో మంగళవారం జగ్గంపేట మండల జేసీఎస్ కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు ఆధ్వర్యంలో పూడికను తొలగించారు.

తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం

- హాజరుకాని సభ్యులు
- ప్రస్తావనకు రాని సమస్యలు



కౌన్సిల్ సమావేశంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఏలేశ్వరం: ప్రజా సమస్యలు ప్రస్తావనకు రాకుండా మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం తూతూమంత్రంగా ముగిసింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీ సభ్యులు 20 మంది ఉండగా కేవలం చైర్‌పర్సన్‌తో కలిపి ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై ఎటువంటి ప్రస్తావన రాలేదని ఆరోపణలు వస్తున్నాయి. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, మేనేజర్ శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా పాస్టర్ల శాంతిర్యాలీ



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ప్రత్తిపాడు: మణిపూర్ ఘటన, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ప్రత్తిపాడులో మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండల పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు ఏబీ శామ్యూల్ ఆధ్వర్యంలో పాస్టర్లు స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పటి రాస్తారోకో నిర్వహించారు. మణిపూర్ ఘటన, క్రైస్తవులపై దాడులకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ ట్రస్ట్ ప్రతినిధులు జె.జాన్ శామ్యూల్, వి.రత్నం, గుడాల సుందర్రావు, ఊబా కృషావరం, ఆర్.షాలేంరాజు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

జగ్గంపేట: మణిపూర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాలని జగ్గంపేటలో యూటీఎఫ్, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

తొండంగి: శృంగవృక్షంలో సీపీఐ(ఎం.ఎల్) నాయకులు సోమవారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ తుని ఏరియా కమిటీ నాయకులు బంగార్రాజు తదితరులు కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోకవరం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ గోకవరంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, యానిమేటర్లు, ఆశాకార్యకర్తలు పంచాయతీ కార్యాలయం నుంచి మొదలుకొని ఆర్టీసీ బస్టాండ్ వరకూ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

గండేపల్లి: మోటారుసైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలం బాపిరాజు గూడెంకు చెందిన సబ్జా రమేష్ ఆదివారం తన మోటారుసైకిల్‌పై మల్లేపల్లిలో బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో గండేపల్లి శివారు బాబాయ్ హోటల్ వద్ద భోజనం చేసి అనంతరం బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఓటర్ల జాబితా సర్వేలో వలంటీర్లు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: ఓటర్ల జాబితా తనిఖీల్లో వలంటీర్లు పాల్గొనవద్దని ప్రత్తిపాడు అసెంబ్లీ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల జాబితాపై నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సర్వేలో బీఎల్వోల వెంట వలంటీర్లు ఉండరాదన్నారు. నియోజకవర్గంలో 92,932 గృహాలుండగా ఇప్పటివరకూ బీఎల్వోలు 2,168 గృహాలను సందర్శించారని, 4,228 మంది ఓటర్ల జాబితా తనిఖీ పూర్తయ్యిందన్నారు. 382 మంది పేర్లను సరి చేశారన్నారు. ఇంటర్నెట్ సిగ్నల్స్ సమస్య వల్ల గిరిజన గ్రామాల్లో ఓటర్ల నమోదులో జాప్యం జరుగుతుందని ఆమె తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులు, చిరునామా మార్పులు వంటి విషయాల్లో రాజకీయ నాయకులు నేరుగా తహసీల్దార్లకు సూచనలు చేయాలని అసెంబ్లీ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి కోరారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, జి.చిన్నారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రత్తిపాడు గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పరిశీలన

ప్రత్తిపాడు: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ను ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కురుస్తున్న వర్షాలకు సచివాలయ భవనం వైపు ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీ సుమారు 20 మీటర్ల మేర సోమవారం రాత్రి కూలిపోయింది. కూలిన గోడ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కాంప్లెక్స్‌లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని డిపో మేనేజర్ తెలిపారు. ఆయన వెంట డిపో డిప్యూటీ సూపరిటెండెంట్ ఏపీపీఎస్ నారాయణ ఉన్నారు.